క్లుప్తంగా

ఉగాదికి ఆలయాల ముస్తాబు



పండగకు సిద్ధమైన ఆంజనేయస్వామి ఆలయం

మక్కువ: తెలుగు సంవత్సరం ఉగాది పండగకు రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఈ మేరకు మక్కువ మండలంలోని అన్ని గ్రామాల్లో గల రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలను పందిళ్లు, విద్యుత్‌కాంతులతో అలంకరించారు. ఏటా ఉగాదిని తొలి పండగగా తెలుగు ప్రజలు జరుపుకుంటారు. ఉగాది పండగకు అవసరమైన సరుకులు కొనుగోలుచేసేందుకు ప్రజలు మక్కువ రావడంతో, మార్కెట్ సోమవారం కిటకిటలాడింది. మామిడికొమ్మలు, వేపపువ్వు, మామిడికాయల సేకరణలో ప్రజలు బిజీగా కనిపించారు.

ముగ్గురు వలంటీర్లు రాజీనామా



రాజీనామా పత్రాలను చూపిస్తున్న వలంటీర్లు

పాచిపెంట: మండలంలో ముగ్గురు వలంటీర్లు రాజీనామా చేశారు. మండల కేంద్రానికి చెందిన టి.జి.ప్రకాష్, మిర్తివలసకు చెందిన మహేష్, రమేష్‌లు తమ రాజీనామా పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అందించారు. చంద్రబాబు అండ్ కో కుట్రలకు నిరసనగా రాజీనామా చేశామని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసుకుని ప్రజలకు ఉత్తమ సేవలందిస్తామన్నారు.

తాళ్లబురిడిలో 90 మందికి వైద్యసేవలు



గ్రామంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ కౌశిక్

పార్వతీపురంటౌన్: మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో 90 మంది రోగులకు డాక్టర్ కౌశిక్ సోమవారం వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు నియమితులయ్యారని, ఒకరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరొకరు ప్రజల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందిస్తారని చెప్పారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు వారి ఇళ్ల వద్దే వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. గ్రామాల్లో దాదాపు 13 రకాల వైద్య సేవలు అందిస్తున్నామని, 67 రకాల మందులు, 14 రకాల డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎనిమిది రకాల రక్త పరీక్షలు నిర్వహించి రోగులకు నెలకు సరిపడా మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో నెలకు రెండుసార్లు వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



కళ్లాల్లో జొన్న పంటను కూడిక చేస్తున్న రైతులు

సీతానగరం: మండలంలో నీటివనరులున్న గ్రామాల్లో రైతులు సాగు చేసిన జొన్నపంట విక్రయించడానికి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జొన్న రైతులు కోరుతున్నారు. మండలంలోని రంగంపేట, అనంతరాయుడుపేట, బళ్లకృష్ణాపురం, గెడ్డలుప్పి, అప్పయ్యపేట, తామరఖండి, బుడ్డిపేట, లక్ష్మీపురం, చెల్లన్నాయుడువలస, బూర్జ గ్రామాల్లో 410 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశామని రైతులు ఎ.చక్రధర్, ఎస్.ఆనందరావు తెలియజేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ నీటివనరులున్న గ్రామాల్లో సాగు చేసిన మొక్కజొన్నపంట దిగుబడి ఆశాజనకంగా ఉందని ప్రభుత్వం స్పందించి జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు.

నేటి నుంచి మజ్జి గౌరమ్మ ఆలయ వార్షికోత్సవం

భామిని: మండలంలోని బిల్లుమడలో వెలసిన శ్రీ మజ్జిగౌరమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం ఉగాది నుంచి జరగనుంది. ప్రతి ఏడాది ఉగాది రోజున గ్రామ మహిళలు ముర్రాటలతో ఊరేగింపు చేసి మజ్జి గౌరమ్మకు సమర్పించడం ఆనవాయితీ. ఐదు రోజుల పాటు వార్షిక ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

పార్వతీపురం ఫ్యాన్ పరం ఖాయం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పట్టణంలోని 10వ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం నియోజకవర్గంలో ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని ఎమ్మెల్యే జోగారావు స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన పార్వతీపురం పట్టణంలోని 10వ వార్డులో పర్యటించి ప్రజలను ఆయన కలుసుకుని మద్దతు కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ఫలాలు అందుకున్న పేదలంతా సంతోషంగా ఉన్నారన్నారు. అవినీతి రహితంగా పారదర్శక పాలన అందించి, అర్హులైన ప్రతి ఒక్కరికి చెంతకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మోసపూరిత హామీలతో టీడీపీ అధినేత చంద్ర బాబు మళ్లీ ఎన్నికలకు వస్తున్నారని, టీడీపీ నేతల మాటలు నమ్మితే మోసపోతారని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాల రూపంలో కలిగిన లబ్ధిని ప్రతి లబ్ధిదారు గుర్తుంచుకోవాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగేందుకు మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఐదేళ్లలో ఏంతో అభివృద్ధి

ఐదేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్వతీపురం మండలంలో వందల కోట్లతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పులిగుమ్మి, హెచ్ కారాడవలస గ్రామాల్లో ప్రజలను కలుసుకుని మద్దతు కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, స్థానిక వార్డు కౌన్సిలర్ జె. దివ్య, సువ్వాడ లావణ్య, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కౌన్సిలర్ సభ రణభేరి చిన్నంనాయుడు, నిమ్మకాయల సుధీర్ కుమార్, ఎడ్ల త్రినాథ, బొత్స ఆనంద్, జె.దివ్య, పి జయంతి, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, బంకురు రవికుమార్, పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ వి.గురురాజు జేసీఎస్ కన్వీనర్ బి.వాసుదేవరావు, నాయకులు మజ్జి శేఖర్, బలగ నాగేశ్వరరావు, గృహ సారథులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మండలంలోని పులిగుమ్మిలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జోగారావు

జగనన్నను ఆశీర్వదించండి



ప్రచారంలో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

పాచిపెంట: సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మళ్లీ ఆశీర్వదించి, ప్రజాసంక్షేమం, అభివృద్ధి పాలనకు మళ్లీ పట్టం కట్టాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర కోరారు. ఈ మేరకు పాచిపెంట మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జీ ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి రాజన్నదొర సోమవారం ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమ గ్రామానికి వచ్చిన ప్రియతమ నేత రాజన్నదొరకు ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా అత్యంత పారదర్శకంగా లక్షల కోట్ల రూపాయలను వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జమచేశారన్నారు. ప్రతి ఇంటికి ఓ పెద్దకొడుకులా, ఓ సోదరుడిలా అండగా నిలిచారని గుర్తుచేశారు. ప్రజలకు మంచి చేసింది జగన్‌కాగా, ప్రజలను మోసం చేసింది చంద్రబాబని విమర్శించారు. 2014 ఎన్నికల్లో మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీలను అమలు చేయకుండా మహిళలు, రైతులు,యువత తదితర అన్ని వర్గాలను చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు.

ప్రచారంలో ప్రజలతో మమేకం

ప్రజలకు మంచి చేయడమే జగన్ అజెండా కాగా, ప్రజలను మోసం చేయడమే టీడీపీ కూటమి అజెండా అని ప్రజలు గుర్తించాలని కోరారు. ఎమ్మెల్యే, ఎంపీకి రెండు ఓట్లు ఫ్యాన్‌గుర్తుపై వేసి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలబడాలని కోరారు. ప్రచారంలో భాగంగా రజకులు, విశ్వబ్రాహ్మణులు, చింతపిక్కల తీస్తున్న మహిళలు తదితరుల వద్దకు వెళ్లి కలిసి వారితో పనిలో మమేకమై తనదైన శైలిలో రాజన్నదొర చేసిన ప్రచారం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. జగనన్న, రాజన్నదొరల గెలుపు తథ్యమంటూ పార్టీ నాయకులు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకోవడం విశేషం. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు, వైస్‌ఎంపీపీ మీసాల నారాయణమ్మ, కొరిపల్లి రవీంద్ర, ఎంపీటీసీ దండి కొండలరావు, జేసీఎస్ కన్వీనర్ టి.గౌరీశ్వరరావు, కూరాకుల కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తమామిడి పార్వతి, మాజీ వైస్‌ఎంపీపీ గండిపల్లి రాము, ప్రజాప్రతినిధులు, నాయకులు, సలాది అప్పలనాయుడు, మజ్జి వెంకటరావు, తదితరులు ఉన్నారు.

నాగరాజు సేవలు చిరస్మరణీయం

సీతానగరం:

వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి.నాగరాజు పట్నాయక్ సేవలు చిరస్మరణీయమని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సూరంపేట పంచాయతీ చిన్నా రా యుడుపేట గ్రామానికి చెందిన నాగరాజు పట్నాయక్ గుండెపోటుతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం ఉదయం నాగరాజు నివాసానికి చేరుకుని ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి నాగరాజు పట్నాయక్ కుటుంబసభ్యులు పార్టీకి ఎనలేని సేవలందిస్తున్నారన్నారు. నాగరాజు పట్నాయక్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.



బి నాగరాజు పట్నాయక్ మృతదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

వేతనదారులు సమయ పాలన పాటించాలి



కన్నయ్యచెరువులో పనిచేస్తున్న వేతనదారులు

సీతానగరం: ఎండలు తీవ్రంగాఉన్నందున ఉపాధి హామీ పథకం వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని ఏపీఓ భాను అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పెదభోగిలి పంచాయతీ కన్నయ్యచెరువు, పాపయ్య చెరువుల్లో వేతనదారులు చేస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కన్నయ్యచెరువులో వేతనదారులనుద్దేశించి ఏపీఓ భాను మాట్లాడుతూ కన్నయ్య చెరువు, పాపయ్య చెరువులో సోమవారం 385 మంది వేతనదారులు పాల్గొన్నారని తెలియజేశారు. మండలంలో ఎండలు తీవ్రంగా ఉన్న కారణంగా వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకూ, సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకూ ఉపాధి హామీ పనుల్లో పాల్గొనాలని కోరారు.అలాగే వేతన దారులందరూ చల్లని నీరులేదా మజ్జిగ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పనిచేస్తున్న సమయంలో చల్లని నీడ నిచ్చేచెట్లకింద ఉంచాలని చెప్పారు. కార్యక్రమం లో టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు, మేట్‌లు పాల్గొన్నారు.

20న ఏకలవ్య ప్రవేశ పరీక్ష

పార్వతీపురం టౌన్:

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి, 7వ తరగతి, 8వ తరగతి, 9వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రవేశపరీక్ష ఈనెల 20న జరుగుతుందన్నారు. స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ సమ్మెటివ్–2 పరీక్షలు ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నందున ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు జరగవలసిన ప్రవేశ పరీక్ష ఈ నెల 13 నుంచి 20 వ తేదీకి మార్చినట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం కన్వీనర్ ప్రిన్సిపాల్ ఫోన్‌నంబర్ 6303508032, గురుకులం సెల్ ఇన్‌చార్జ్ ఫోన్‌నంబర్ 9490971090లను సంప్రదించాలని సూచించారు.

పది స్పాట్ పూర్తి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పదవ తరగతి స్పాట్ వాల్యుయేషన్ పూర్తైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి వి.పగడాలమ్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 103489 ఆన్సర్ షీట్‌ల వాల్యుయేషన్ పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాల్లో ఎనిమిది రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. మొత్తం 367మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 59 చీఫ్ ఎగ్జామినర్లు, ఇద్దరు డిప్యూటీ క్యాంపు ఆఫీసర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు.

నేడు పోలమాంబ ఆలయంలో పంచాంగ శ్రవణం



శంబరపోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఆలయంలో ఉగాది పండగను పురస్కరించుకుని మంగళవారం పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు ఈవో వీవీ సూర్యనారాయణ సోమవారం తెలిపారు. ప్రముఖ పండితుడు, తెలుగుభాషా పండితులు బంకుపల్లి లక్ష్మీనారాయణ పంచాంగ పఠనం చేయనున్నట్లు ఈవో పేర్కొన్నారు. శ్రీక్రోధినామ సంవత్సరంలో ప్రజలకు ఏవిధంగా మేలు జరగనుందో వివరించనున్నారని, భక్తులు ఆలయానికి వచ్చి, అమ్మవారిని దర్శించుకుని పంచాంగ శ్రవణంలో పాల్గొనాలని కోరారు.

ఉగాది ఉత్సవాలకు ముస్తాబైన భోగాలమ్మతల్లి



నూతన వస్త్రాలతో భక్తులకు దర్శనమిచ్చిన భోగాలమ్మ తల్లి

సీతానగరం: మండలంలోని వివిధగ్రామాల ప్రజలు ఆరాధ్యదైవంగా పూజించే భోగాలమ్మ తల్లి ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ మేరకు భక్తులంతా అమ్మవారి గుడికి వెళ్లి నూతన వస్త్రాలతో తల్లిని అలంకరించి పూజలు చేశారు. భోగాలమ్మ తల్లి అమ్మవారిని పూజించిన బుడ్డిపేట, సీతానగరం, అప్పయ్యపేట, పెదభోగిలి, జోగింపేట గ్రామాల ప్రజల తెలుగు కొత్త సంవత్సరంలో పంటలు కలిసి రావడానికి అనుకూలంగా వర్షాలు కురిసేలా దీవించాలని కోరుకున్నారు.

చురుగ్గా శ్రీరామనవమి ఉత్సవ ఏర్పాట్లు



దబ్బివీధిలో విద్యుత్‌దీపాల అలంకరణతో జరుగుతున్న శ్రీరామ నవరాత్రోత్సవ ఏర్పాట్లు

సాలూరు: శ్రీరామనవమి ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు. సాలూరు పట్టణంలోని పెదకోమటిపేట, వెలంపేట, గాడివీధి, మెంటాడ వీధి, వెంకటేశ్వర కాలనీ, నెయ్యిలవీధి తదితర ప్రాంతాల్లో శ్రీరామనవమి ఉత్సవ ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. విద్యుత్ దీపాల వెలుగులు, ప్రత్యేక అలంకరణతో స్థానికంగా ఆధ్యాత్మికంగా సందడి వాతావరణం నెలకొంది.

తెలుగు సంవత్సరాదిపై అవగాహన



గేదెలపేట పాఠశాలలో సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు

బలిజిపేట: తెలుగు సంవత్సరాది ప్రత్యేకత, విశిష్టత విద్యార్థులకు తెలియచేసి, సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థులకు ఉగాది పచ్చడి విశిష్టతను గేదెలపేట పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించారు. అందులో భాగంగా వారితో సంప్రదాయ దుస్తులు ధరింపచేసి పండగను ఏవిధంగా జరుపుకుంటారు? ఉగాది పచ్చడి ఏవిధంగా తయారుచేస్తారు? ఎందుకు తయారుచేస్తారు? దానిలో వినియోగించే వస్తువులు ఏమిటి, వాటినే ఎందుకు వినియోగిస్తారో వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డి.రామారావు, ఉపాధ్యాయులు గజలక్ష్మి, జి.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాంగ శ్రవణం

తెలుగు సంవత్సరాది సందర్భంగా అమవాస్య తిథి నాడు సోమవారం మండలంలోని గ్రామాల్లో అర్చకులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. అందులో భాగంగా అజ్జాడ గ్రామంలో కె.గోపాలకృష్ణ, ప్రసాదరావులు పంచాంగ పఠనం చేశారు. శ్రీ క్రోధినామ సంవత్సరం సందర్భంగా సంవత్సర ఫలితాలు ఏవిధంగా ఉంటాయి, రైతులకు ఏవిధంగా పంటలు పండుతాయి? మంగళవారం ఉగాదినాడు ఏరువాక కార్యక్రమాన్ని ఎన్ని గంటల నుంచి ఎన్ని గంటల వరకు నిర్వహించాలనే విషయాలను గ్రామస్తులకు వివరంగా తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అజ్జాడలో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకుడు గోపాలకృష్ణ



సీతానగరం: పెదంకలాంలో పంచాంగ పఠనం చేస్తున్న వేదపండితుడు నానిశర్మ

గ్రామాల్లో పంచాంగ పఠనం

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో గల రామమందిరాల్లో గ్రామ పెద్దల అధ్వర్యంలో పురోహితులు సోమవారం తెలుగు క్రోధి నామ సంవత్సరానికి సంబంధించిన పంచాంగాన్ని చదివి వినించారు.ఈ మేరకు ఎస్ఎస్ పురంలో గాయత్రి జ్యోతిషాలయం అర్చకుడు బ్రహ్మశ్రీ యార్లగడ్డ రాంబాబు పంచాంగం చదివి వినించారు. అలాగే పెదంకలాం రామమందిరంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బి.శ్రీరాములు నాయుడు, సర్పంచ్ బి.శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో వేదపండితుడు వేదుల నాని శర్మ, కృష్ణారాయపురంలో టి.రాంబాబు శర్మ పంచాంగాన్ని ప్రజలకు వివరించారు.

మామిడిపల్లిలో పంచాంగ శ్రవణం



ఆలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న పెద్దలు

సాలూరు రూరల్: తెలుగు సంవత్సరాది సందర్భంగా సోమవారం సాలూరు మండలంలోని మామిడిపల్లిలో సర్పంచ్ సువ్వాడ శశికళ ఆధ్వర్యంలో వేద పండితుడు అందవల్లి సూర్యనారాయణ శాస్త్రి గిరిజారామలింగేశ్వర స్వామి ఆలయంలో పంచాంగ పఠనం గావించారు. ఏటా గ్రామంలో గ్రామపెద్దలు గ్రామప్రజల బాగోగులు తెలుసుకునేందుకు ఆనవాయితీగా పంచాంగ శ్రవణం చేస్తారు. అందులో భాగంగా ఉగాది ముందురోజు సాయంత్రం పండితులతో ఆలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని గ్రామపెద్దలు కొనసాగించారు. కార్యక్రమంలో సువ్వాడ భరత్ శ్రీనివాస్, సువ్వాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.